క్లుప్తంగా

దేశంలో మత విద్వేషాలు రెచ్చగొడుతున్న బీజేపీ

కడప వైఎస్ఆర్ సర్కిల్: బీజేపీ ప్రభుత్వం దేశంలో మత విద్వేషాలను రెచ్చగొడుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి ఈశ్వరయ్య పేర్కొన్నారు. శనివారం సీపీఐ కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ బీజేపీ పాలన అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, వాగ్దానాలు అమలు చేయలేదన్నారు. మహిళలపై దాడులు, వేధింపులు ఎక్కువయ్యాయన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెంచేశారన్నారు. ఈ సమస్యలపై 8న ఛలో తిరుపతి నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలను తగ్గించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం పాత బస్టాండ్ లో ఉన్న పూలే సర్కిల్‌లో సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. తక్షణమే విద్యుత్ కోతలు అరికట్టాలన్నారు. ఈ నెల 4న జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో చేపట్టనున్న ఆందోళనలలో ప్రజానీకం పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కామనురు శ్రీనివాసులరెడ్డి, సత్య నారాయణ, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణ మన బాధ్యత

వైవీయూ : పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేమల సలీంబాషా పేర్కొన్నారు. శనివారం కళాశాలలో ఎల్‌ఐసీ బీమా వారోత్సవాల్లో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. జి. విజయలక్ష్మి, డా. పి. శచీదేవి, ఎల్ఐసీ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ సంజీవ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎ. నాగరాజు పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో సీఐటీయూ రెండు రోజుల వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేయడం దుర్మార్గమన్నారు. కులాల, మతాల మధ్య గొడవలు సృష్టించి ఉద్యోగుల సమస్యలు పట్టించుకోకపోవడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కే శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బి మనోహర్ పాల్గొన్నారు.

అమ్మలకు ప్రతిరూపం మేరీ మాత


మేరి మాత స్వరూపాన్ని ఊరేగిస్తున్న విశ్వాసులు

కడప కల్చరల్ : పిల్లలను ఎలా పెంచాలో, ఎలా విద్యాబుద్ధులు చెప్పించాలో, ఎలా వినయ విధేయతలు నేర్పించాలో మరియ మాత ద్వారా మనం తెలుసుకోవాలని మేత్రాసన కోశాధికారి రెవ ఫాదర్ దేవదాసు, రామాపురం విచారణ గురువులు రెవ ఫాదర్ సి హెచ్ జాన్సన్ అన్నారు. కడప ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం నవదిన ఉత్సవాలలో భాగంగా ఐదవరోజు శనివారం ఫాదర్ దేవదాస్ దివ్య బలి పూజను సమర్పించగా, సీహెచ్ జాన్సన్ మేరీమాత దివ్య సందేశాన్ని అందజేశారు. ప్రార్థనకు ముందు ప్రత్యేకంగా అలంకరించబడిన తేరులో మేరిమాత స్వరూపాన్ని ఉంచి క్షేత్ర ప్రాంగణంలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో పుణ్యక్షేత్ర డైరెక్టర్ ఫాదర్ ఎండి ప్రసాదరావు, సహాయ డైరెక్టర్ ఫాదర్ విల్సన్, ఆరోగ్యమాత మదర్లు పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ

కడప కల్చరల్ : కడప నగర పరిధిలోని అమ్మ ఒడి బాలల శరణాలయంలోని చిన్నారులకు శనివారం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు నూతన వస్త్రాలను అందజేశారు. సంస్థ కేంద్ర కమిటీ సభ్యులు రాటాల గోపి ఆధ్వర్యంలో మా అమ్మ ఒడి కేంద్రానికి వెళ్లి అక్కడి 11 మంది అనాథ బాలలకు నూతన దుస్తులు పంపిణీ చేశారు. మా అమ్మ ఒడి నిర్వాహకులు వినోద, ఉపాధ్యాయులు, మానవత సంస్థ ఎగ్జిక్యూటివ్ సభ్యులు శ్రీ లక్ష్మీ నారాయణరెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

హెల్త్‌కార్డులతో పూర్తిగా క్యాస్‌లెస్ వైద్యం అందించాలి

కడప ఎడ్యుకేషన్: పెన్షనర్లకు హెల్త్‌కార్డులతో పూర్తిగా క్యాస్‌లెస్ వైద్యం అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు చెన్నారెడ్డి అన్నారు. శనివారం కడప పెన్షనర్ల సంఘం కార్యాలయంలో కార్యవర్గ సమావేశం జరిగింది. ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి రామ్మూర్తినాయుడు, పెన్షనర్ల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నాగమునిరెడ్డి, గానుగపెంట హనుమంతరావు మాట్లాడారు.

వైఎస్సార్‌కు మహా నివాళి

కడప కార్పొరేషన్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని కడప నగరంలో ఘనంగా నిర్వహించారు. ఆయన సేవలను కొనియాడారు. నగరంలోని హెడ్ పోస్టాఫీసు ఎదురుగా ఉన్న వైఎస్సార్ విగ్రహానికి ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా, మేయర్ కె. సురేష్ బాబు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అహ్మద్‌బాషా, జయచంద్రారెడ్డి, ఉమైర్, సీహెచ్ వినోద్ కుమార్, రామలక్ష్మణ్‌రెడ్డి, పస్తం అంజి, త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

– స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి క్రిష్ణవేణి ఆధ్వర్యంలో వృద్ధులు, నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై దుప్పట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు పాకా సురేష్, టీపీ వెంకట సుబ్బమ్మ, తులశమ్మ, విజయకుమారి పాల్గొన్నారు.

– ఏపీహెచ్‌బీ కాలనీలోని రాజీవ్ పార్కు వద్దనున్న వైఎస్సార్ విగ్రహానికి 20వ డివిజన్ ఇన్‌చార్జి శ్రీరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో టీటీడీ బోర్డు సభ్యులు ఆర్. వెంకట సుబ్బారెడ్డి(మాసీమ బాబు) పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బాలస్వామిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మునిశేఖర్‌రెడ్డి, రహీమ్, రాజా, మనోజ్ పాల్గొన్నారు.

– కడప నగరపాలక సంస్థ కార్యాలయంలో మున్సిపల్ ఉద్యోగులు వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

ఏఎఫ్‌యూలో ..

కడప ఎడ్యుకేషన్: డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో శనివారం వైఎస్ వర్ధంతి సందర్భంగా వీసీ ఆచార్య ఆంజనేయ ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య సురేంద్రనాథ్‌రెడ్డి తదితరులు వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్ పాలనలో ఫీజురీయంబర్స్‌మెంట్, 108, 104, ఆరోగ్యశ్రీ ఇలా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి పేదలగుండెల్లో గుడి కట్టుకున్నారన్నారు. అలాంటి మహోన్నత వ్యక్తి పేరు యూనివర్సిటీకి పేరు పెట్టడం ఎంతో సంతోషం అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

కడప రిమ్స్‌లో ..

కడప అర్బన్: వైఎస్ వర్ధంతి సందర్భంగా శనివారం కడప రిమ్స్ లో వివిధ కార్యక్రమాలను ఇన్‌ఛార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. సురేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మొదట ప్రభుత్వ దంతవైద్య కళాశాల ఎదురుగా వున్న వైఎస్ఆర్ విగ్రహానికి డాక్టర్ సురేశ్వర్ రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వైఎస్ఆర్ రాష్ట్రానికి, జిల్లాకు ప్రధానంగా కడప నగర శివార్లలో రిమ్స్ పేరుమీద వైద్య వరాన్ని అందించారని గుర్తు చేసుకున్నారు. తరువాత కడప రిమ్స్ బ్లడ్‌బ్యాంక్‌లో పి. రామిరెడ్డి ఫిజియోథెరపీ కళాశాల విద్యార్థులు 50 మందికి పైగా రక్తదానం చేశారు. తరువాత ప్రభుత్వ దంతవైద్య కళాశాల ఆవరణంలో ప్రైవేట్ అంబులెన్స్‌ల డ్రైవర్లు, యజమానులు కలిసి అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కడప ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ, ప్రభుత్వ దంతవైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోత్స్న, ఆర్ఎంఓలు డాక్టర్ వై. శ్రీనివాసులు, డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ సునీత, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2 శ్రీకాంత్, వైద్యులు పాల్గొన్నారు.

బ్రౌన్ గ్రంథాలయ ప్రగతికర్త

కడప కల్చరల్ : సీపీ బ్రౌన్ గ్రంథాలయ ప్రగతికి వైఎస్ఆర్ ప్రధాన కారకులయ్యారని బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాద రెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం బ్రౌన్ కేంద్రంలో వైవీయూ పాలక మండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, బ్రౌన్ కేంద్రం సిబ్బందితో కలిసి ఆయన వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల అలంకరించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య రామప్రసాద్‌రెడ్డి, ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్... సీపీ బ్రౌన్ గ్రంథాలయానికి మహర్దశ కలిగించిన మహానేత అని, నేడు సీఎం వైఎస్ జగన్ తండ్రి బాటలోనే సాగుతూ ఆ వైభవాన్ని కొనసాగిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సలహామండలి సభ్యులు జానమద్ది విజయ భాస్కర్, బ్రౌన్ కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, సిబ్బంది పాల్గొన్నారు.

– రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం శనివారం వైఎస్సార్ వర్ధంతిని సంఘం కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గౌరవ సలహాదారు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు, అధ్యక్షులు చెన్నారెడ్డి, కార్యదర్శి రామ్మూర్తినాయుడు పాల్గొన్నారు.

వైవీయూలో ..

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయంలో వైఎస్ వర్ధంతి సందర్భంగా వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, వ్యవస్థాపక వీసీ ఆచార్య అర్జుల రామచంద్రారెడ్డి నివాళులర్పించారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డితో కలిసి వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఉన్నతవిద్యను గ్రామీణులకు అందుబాటులోకి తీసుకువచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఇక్కడ పనిచేసే ప్రతిఒక్కరూ ఆయన్ను జీవితాంతం గుర్తుంచుకోవాల్సి ఉంటుందన్నారు. ఆచార్య అర్జుల మాట్లాడుతూ వైఎస్ కలల సౌధం వైవీయూ అన్నారు. ఆయన ఆకాంక్షలు నెరవేర్చేలా ఈ విద్యాలయాన్ని ఉన్నతస్థితికి తీసుకువెళ్లాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు ఆచార్య పి. చంద్రమతీశంకర్, డా. మాదక్క, డీన్‌లు, ఆచార్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్ లేకపోతే మనమెవ్వరం ఇక్కడ లేము

కడప ఎడ్యుకేషన్: ప్రజల జీవితాల్లో వెలుగు నింపేందుకు పరితపించిన అసలు సిసలైన రాజకీయ నాయకుడు వైఎస్ అని వైవీయూ వ్యవస్థాపక వీసీ ఆచార్య అర్జుల రామచంద్రారెడ్డి అన్నారు. వైవీయూ నూతన పరిపాలన భవనంలోని అన్నమాచార్య సెనేట్‌హాల్లో వైఎస్ స్మారకోపన్యాసం నిర్వహించారు. ప్రత్యేక ఉపన్యాసకులుగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో విశ్వవిద్యాలయాలు స్థాపించి ఉన్నత విద్యకు దారులు తెలిచిన మహోన్నత వ్యక్తి వైఎస్సార్ అన్నారు. వైఎస్ లేకపోతే మనమెవ్వరం ఇక్కడ ఉండే వాళ్లం కాదని, ఈ భవనాలు, ఇంతమంది విద్యార్థులు, జాతీయ స్థాయి పరిశోధనలు జరిగేవి కాదన్నారు. వీసీ ఆచార్య చింతా సుధాకర్, ప్రధాన ఆచార్యులు రఘునాథ రెడ్డి, కుల సచివులు ఆచార్య వైపీ వెంకటసుబ్బయ్య తదితరులు వైఎస్ సేవలు కొనియాడారు.

డీసీసీ బ్యాంకులో ..

కడప అగ్రికల్చర్: డీసీసీ బ్యాంకు ఆధ్వర్యంలో వైఎస్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. డీసీసీ బ్యాంకు సీఈఓ కందుల రాజేంద్రకుమార్ బ్యాంకు వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి బ్యాంకు సిబ్బందితో కలిసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ బ్యాంకు జనరల్ మేనేజర్ రాజామణి, డీజీఎం బాలిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఏజీఎంలు వీరబ్రహ్మం, రాజేంద్రప్రసాద్‌రెడ్డి బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో...

కడప కోటిరెడ్డి సర్కిల్ : వైఎస్ వర్ధంతిని కడప ఆర్టీసీ బస్టాండులో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.బాబా ఫక్రుద్దీన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ బోర్డు చైర్మన్ పులి సునీల్‌కుమార్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ టీయూసీ జిల్లా అధ్యక్షులు జాషువ, యువ నాయకులు రహీం, వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు పీఎస్ ఖాన్, పోసా శ్రీనివాసులు, రెడ్డి, కేసీ రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కడప ఎడ్యుకేషన్: మైనార్టీల జీవితాల్లో వెలుగు నింపిన మహానేత వైఎస్ అని ఆల్ మేవా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఫరూక్ పేర్కొన్నారు. వైఎస్సార్ జిల్లా ఆల్‌మేవా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జలీల్‌ఖాన్, నజీర్‌బాష ఆధ్వర్యంలో కడప రవీంద్రనగర్‌లోని ఉర్దూ అకాడమి గ్రంథాలయంలో వైఎస్సార్ వర్ధంతి సంస్మరణ సభను నిర్వహించారు. డాక్టర్ ఫరూక్, గౌరవ అధ్యక్షుడు గౌస్‌పీర్, రాష్ట్ర, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.


కడప కార్పొరేషన్: వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు


కడప కార్పొరేషన్: పార్టీ కార్యాలయంలో వైఎస్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, పార్టీ నేతలు


కడప కార్పొరేషన్: అన్నదానం చేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు


వైవీయూ: నివాళి అర్పిస్తున్న వీసీ ఆచార్య చింతా సుధాకర్, పూర్వపు వీసీ ఆచార్య అర్జుల


కడప అగ్రికల్చర్: వైఎస్ విగ్రహానికి పూలమాల వేస్తున్న డీసీసీ బ్యాంకు సీఈఓ రాజేంద్రకుమార్


కడప ఎడ్యుకేషన్: ఏఎఫ్‌యూలో నివాళి అర్పిస్తున్న వీసీ ఆంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ సురేంద్రనాథ్‌రెడ్డి

చరిత్ర సృష్టించిన వైఎస్సార్

-వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె. సురేష్ బాబు,
- పార్టీ కార్యాలయంలో ఘనంగా వైఎస్సార్ వర్ధంతి

కడప కార్పొరేషన్: వైఎస్ఆర్ ప్రజా సంక్షేమ పథకాలతో రాష్ట్ర చరిత్రను తిరగరాశారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు కె. సురేష్ బాబు అన్నారు. శనివారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, జిల్లా పరిషత్ అధ్యక్షులు ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, కమలాపురం, రైల్వేకోడూరు ఎమ్మెల్యేలు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, కొరుముట్ల శ్రీనివాసులుతో కలిసి వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ ప్రతిపక్షనేతగా ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్న వైఎస్సార్ అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఒక వైద్యుడిగా ఆయన ప్రవేశపెట్టిన 108, 104, ఆరోగ్యశ్రీ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని కొనియాడారు.

– డిప్యూటీ సీఎం అంజద్‌బాషా మాట్లాడుతూ వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఫీజు రీయంబర్స్‌మెంట్ వల్ల ఎంతో మంది ఉన్నతచదువులు చదివారని, ఉచిత విద్యుత్, ప్రాజెక్టుల వల్ల రైతులకు ఎంతో మేలు జరిగిందన్నారు.

– జెడ్పీ చైర్మెన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే కొరుముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ వైఎస్సార్ గొప్ప ప్రజానాయకుడని, ఆయన లేనిలోటు పూడ్చలేనిదన్నారు. ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరాయన్నారు. తండ్రిబాటలోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పయనిస్తున్నారని, తండ్రికంటే రెండు అడుగులు ముందుకేసి సంక్షేమ పథకాలు, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారన్నారు.

– ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్, వేర్‌హౌస్ కార్పొరేషన్ చైర్మన్ కరిముల్లా, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, ఏపీఎస్ఆర్‌టీఎస్ డైరెక్టర్ బీహెచ్ ఇలియాస్, జయచంద్రారెడ్డి, ఐస్‌క్రీం రవి, పవర్ అల్తాఫ్, షఫీ, ఎస్. సుబ్బారెడ్డి, తోటక్రిష్ణ, టీపీ వెంకట సుబ్బమ్మ, మూలే సరస్వతి, ఉమామహేశ్వరి, సునీత, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.


కడప కల్చరల్: వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న బ్రౌన్ కేంద్ర సంచాలకులు, సిబ్బంది


కడప అర్బన్: కడప దంత వైద్య కళాశాల ఆవరణలో..


కడప కోటిరెడ్డి సర్కిల్: ఆర్టీసీ బస్టాండ్‌లో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం


కడప అర్బన్: కడప రిమ్స్ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

సీఎంకు ఘన స్వాగతం

కడప కార్పొరేషన్: జిల్లా పర్యటనలో భాగంగా శనివారం ఉదయం కడప విమానాశ్రయం చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు ఘన స్వాగతం పలికారు. వైఎస్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి ఉదయం 11.30 గంటలకు కడప విమానాశ్రయం చేరుకున్నారు. ఈ నేపథ్యంలో పలువురు ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అలాగే ఆయన తిరిగి మధ్యాహ్నం గన్నవరం వెళ్లే సందర్భంలో కూడా కడప విమా నాశ్రయంలో అధికారులు, ప్రజా ప్రతి నిధులు వీడ్కోలు పలికారు.


సీఎం వైఎస్ జగన్‌కు స్వాగతం పలుకుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్


సీఎం వైఎస్ జగన్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, మేడా మల్లికార్జునరెడ్డి


ఎమ్మెల్సీలు జకియాఖానం, రామసుబ్బారెడ్డి, ఎమ్మెల్యే సుధ


ఎమ్మెల్యే రాచమల్లు, జెడ్పీటీసీ నరేన్


కలెక్టర్ విజయరామరాజు

సదుపాయాల కల్పనకు నిధులు

- డిప్యూటీ సీఎం అంజద్‌బాషా


కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని వినతి పత్రం సమర్పిస్తున్న బేడ, బుడగ జంగం నాయకులు

కడప కార్పొరేషన్: కడప నగరంలో మౌళిక సదుపాయాల కల్పనకు ప్రతి డివిజన్‌కు రూ.80లక్షలు మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు. శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన 48వ డివిజన్‌లోని బుడగజంగం కాలనీలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల వల్ల వారికి కలిగిన మేలును వివరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇది మొక్కుబడి కార్యక్రమం కాదని...మనసా...వాచా...కర్మేణా చిత్తశుద్ధితో నిర్వహిస్తున్నామని, 40 ఏళ్లుగా పరిష్కారం కాకుండా చెంచు కులస్తుల కుల ధ్రువీకరణ పత్రాల సమస్యను 24 గంటల్లో పరిష్కరించామన్నారు.

– రాణి అనే మహిళ పూరి గుడిసెలో ఉండటం గమనించిన డిప్యూటీ సీఎం ఆమెకు పక్కా గృహం మంజూరు చేయాలని ఆదేశించారు. తనకు రేషన్ కార్డు లేదని బాలక్రిష్ణ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు.

కులధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయండి

తమ కులస్తులకు కులధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని బేడ, బుడగ జంగం పోరాట హక్కుల సమితి నాయకులు పస్తం అంజి కోరారు. శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కాలనీకి వచ్చిన డిప్యూటీ సీఎంకు ఆయన వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, నాయకులు బంగారు నాగయ్య, పవర్ అల్తాఫ్, మున్నా, మధు, తోటక్రిష్ణ, సుబ్బారెడ్డి, సంపత్, గోపాలక్రిష్ణ, అహమ్మద్, మూలే సరస్వతి, టీపీ వెంకట సుబ్బమ్మ, చైతల్య పాల్గొన్నారు.

ఆర్థికసాయం

కడప కల్చరల్ : బాసట స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు మేరువ బాలాజీరావు, ప్రధాన సభ్యులు కార్తీక్‌రెడ్డిలు శనివారం ఇద్దరు విద్యార్థుల చదువుకోసం ఆర్థికసాయం అందించారు. పులివెందులకు చెందిన పట్నం కార్తీక్ విజయవాడలో ఇంజనీరింగ్ చదివేందుకు అర్హత సాధించినా ఆర్థిక ఇబ్బంది ఎదురైంది. ఈ విషయాన్ని తెలుసుకుని రూ. 20 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. అలాగే కడప నాగరాజుపేటకు చెందిన విద్యార్థి అఖిల్ ప్రకాశ్ రామాపురం గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదవడానికి అర్హత పొందినా ప్రైవేటు పాఠశాల నుంచి అర్హత పత్రాలు తీసుకునేందుకు పెండింగ్ ఫీజు బకాయిలు చెల్లించాల్సి వచ్చింది. దీంతో రూ. 7 వేలను ఆ విద్యార్థికి అందజేశారు.

డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులకు బదిలీలు నిర్వహించి కేవలం రెండు మాసాలు కూడా గడవక ముందే తమ అనుయాయులకు ప్రభుత్వ ఉత్తర్వులు ద్వారా అక్రమ బదిలీలు నిర్వహించడం అన్యాయం అని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా అన్నారు. ప్రభుత్వం చేపట్టిన అక్రమ బదిలీలను ఆపాలని శనివారం కడప డీఈఓ కార్యాలయం ఎదుట యూటీఎఫ్ కడపజిల్లాశాఖ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయ్‌కుమార్, మహేష్‌బాబు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రతి సమస్యకూ పరిష్కారం ఉంటుంది

కడప ఎడ్యుకేషన్: ప్రతి సమస్యకు పరిష్కారం దాని వెంటే ఉంటుందని ఓపిక, సహనంతో ప్రయత్నిస్తే జీవితం ఆహ్లాదకరంగా సాగుతుందని వైవీయూ ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. శనివారం వైవీయూ మనో విజ్ఞానశాఖ, అడ్వాన్స్‌డ్ సైకలాజికల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో 'ఆత్మహత్యల నివారణలో మానసిక నిపుణులు' అనే అంశంపై రెండు రోజుల కార్యశాల శిక్షణ కన్వీనర్ సహ ఆచార్యులు లలిత, కో కన్వీనర్ లాజర్ నిర్వహణలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వీసీ ఆచార్య చింతా సుధాకర్, ప్రత్యేక అతిథి విశ్వ విద్యాలయ వ్యవస్థాపక ఉపకులపతి ఆచార్య అర్జుల రామచంద్రారెడ్డి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఒత్తిడి నుంచి దూరంగా ఉండేందుకు యోగ, పుస్తకాలు చదవడం, సంగీతం వినడం అలవాటు చేసుకోవాలన్నారు. కులసచివులు ఆచార్య వెంకట సుబ్బయ్య, ప్రధాన ఆచార్యులు రఘునాథరెడ్డి మాట్లాడారు.

పార్కు నిర్వహణపై కితాబు

వైవీయూలో సీతాకోక చిలుకల పార్కును వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్, వ్యవస్థాపక ఉపకులపతి ఆచార్య అర్జుల రామచంద్రారెడ్డి సందర్శించారు. ఆరోజు నుంచి ఇప్పటి వరకు పార్కును కొనసాగించడం అభినందనీయం అని ఆచార్య అర్జుల రామచంద్రారెడ్డి అన్నారు.

పాలకొండ్రాయుడి కల్యాణ వైభవం

కడప కల్చరల్ : శ్రావణమాసం మూడవ శనివారం సందర్భంగా కడప నగర శివార్లలోని పాలకొండల్లో శ్రీ పాలకొండ్రాయస్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. దేవదాయ ధర్మదాయశాఖ ఈఓ శ్రీధర్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత అర్చకులు యోగీశ్వరశర్మ బృందం స్వామి, అమ్మవార్ల మూర్తులకు కల్యాణ క్రతువును నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అడుగడుగునా గోవింద నామస్మరణలు చేశారు. ఉల్లాస భరితంగా జరిగిన ఈ కార్యక్రమానంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కల్యాణం అనంతరం భక్తులందరికీ కల్యాణ ప్రసాదంగా ముత్యాల తలంబ్రాలు అందజేశారు. ఎన్‌సీసీ విద్యార్థులు క్యూలైన్లలో భక్తులకు సహకరించారు.


కల్యాణ మూర్తులుగా పాలకొండరాయస్వామి, అమ్మవారు


పాలకొండలో భక్తుల సందడి

భక్తుల సందడి

శ్రీ పాలకొండ్రాయస్వామి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో కుటుంబాలతో సహా తరలివచ్చారు. నిర్వాహకులు భారీ పందిళ్లు ఏర్పాటు చేశారు. అయినా స్థలం చాలకపోవడంతో పలు చోట్ల చెట్ల నీడన సేద తీరారు. ఆలయ పాదం వద్ద, ఆర్చి సమీపంలో ఇందిరానగర్‌కు చెందిన బాలాజీ ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఏటూరి రామచంద్రారెడ్డి దంపతులు అన్నదానం చేశారు.

కడప రాయుడికి ప్రత్యేక పూజలు

కడప కల్చరల్ : దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాసం మూడవ శనివారాన్ని పురస్కరించుకుని పూజలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామిని పల్లకీలో కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు.

కడప రాయుని సన్నిధిలో టీటీడీ బోర్డు సభ్యుడు

తిరుమల–తిరుపతి దేవస్థానాల పాలక మండలి సభ్యుడిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆర్.వెంకట సుబ్బారెడ్డి (మాసీమ బాబు) శనివారం శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, అర్చక బృందం ఆయనకు పూర్ణఫలస్వాగతం పలికి వేదమంత్రోచ్చాటనల మధ్య ఆలయ ప్రదక్షిణ చేయించారు.


దేవునికడప ఆలయంలో టీటీడీ బోర్డు సభ్యుడు మాసీమబాబు, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి

అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శింపజేసి ఆలయ చరిత్రను వివరించారు. కార్యక్రమానికి హాజరైన నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి, ప్రముఖులు జరుగు రాజశేఖరరెడ్డిలకు కూడా నిర్వాహకులు స్వాగతం పలికారు.